రామగుండం సీపీగా శ్రీనివాసులు

ఏసీసీ, ఫిబ్రవరి 12: రామగుండం పోలీస్ కమిషనర్‌గా శ్రీనివాసులు నియమిస్తూ చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీపీగా పనిచేసిన రెమా రాజేశ్వరి డీఐజీ వుమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ అయ్యారు. రెమా రాజేశ్వరి బదిలీపై వెళ్లడంతో కొద్ది రోజులుగా మల్టీ జోన్1 ఇన్‌చార్జి డీఐజీగా, రామగుండం సీపీగా ఐజీ తరుణ్‌జోషి ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీఐజీ హోదా కలిగి పోస్టింగ్ కోసం వేచి ఉన్న ఎం.శ్రీనివాసులును రామగుండం కమిషనర్‌గా పోస్టింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి

హాజీపూర్, ఫిబ్రవరి 12: ముల్కల్లలోని ఎస్‌ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపికచేసినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్‌లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19వరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే 52వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారుల్లో మహిళలకు ఆసిఫాబాద్‌లో, పురుషులకు జైపూర్‌లో మూడు రోజులపాటు శిక్షణను నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాల కార్యాలయం సూపరింటెండెంట్ యుగేందర్, హ్యాండ్‌బాల్ కోచ్‌లు అరవింద్, రాజలింగు, పీడీలు సదానందం, పద్మ,అలివేలు, పీఈటీలు సంజీవ్, మహేష్, రమేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థుల ద్వితీయ స్థానం



ప్రాజెక్టులో పాల్గొన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 : సృజన టెక్ ఫెస్ట్ 2023-24 టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగం వార్షిక సైన్స్ అండ్ టెక్నాలజీ ఫెస్టివల్‌లో భాగంగా ఈ నెల 10న హైద్రాబాద్‌లోని ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. మెథడ్స్ ఆఫ్ విన్నింగ్ మెటల్స్ అండ్ ఇట్స్ సూటయిన్ బులిటి ప్రాజెక్టు తయారుచేశారు. విద్యార్థులను, గైడ్ అధ్యాపకుడు శ్రీకాంత్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, హెచ్‌వోడీ దేవేందర్ అభినందించారు.

బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ల విడుదల

బెల్లంపల్లి, ఫిబ్రవరి 12: బెల్లంపల్లి పట్టణంలోని స్కై. జిమ్ ఆధ్వర్యంలో మార్చి 3న జరిగే బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కైజిమ్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. స్థానిక నెంబరు2 గ్రౌండ్‌లో మిస్టర్ ఐరన్ మ్యాన్ (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా), మిస్టర్ బెల్లంపల్లి పోటీలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. జిమ్ నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు

చెన్నూరు, ఫిబ్రవరి 12: మండలంలోని కిష్టంపేట, ఎల్లక్కపేట గ్రామాల్లో ఏఈవో సాయికృష్ణ సోమవారం పంటలపై క్షేత్ర పర్యటన చేపట్టారు. ఏయే పంటలు సాగు చేశారో నమోదు చేసుకున్నారు. అనంతరం రైతు వేదికలో వరి పంటలో వచ్చే చీడపీడల నివారణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు. పంటల విషయంలో ఏమైనా సందేహాలుంటే సంప్రదించాలని సూచించారు. అలాగే సేంద్రీయవ్యవసాయంపై అవగాహన కల్పించారు.

మాదిగలకే పెద్దపల్లి సీటు ఇవ్వాలి



కిషన్‌రెడ్డితో మాదిగ ఐక్య వేదిక నాయకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 12: పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని పెద్దపల్లి పార్లమెంట్ మాదిగ ఐక్య వేదిక నాయకులు సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో కలిశారు. వారు మాట్లాడుతూ దశాబ్దన్నర క్రితం ఈ సీటును టీడీపీ పార్టీ మాదిగలకు కేటాయించిందని వారు తెలిపారు. పార్లమెంట్ స్థానం ఏర్పడిన నాటి నుంచి తమ ఉప కులాలకు సీట్లు కేటాయిస్తున్నారని, ఈసారి మాదిగలకు కేటాయించేలా చూడాలన్నారు. ఆయా పార్టీల్లో పని చేస్తున్న మాదిగ అభ్యర్థులకు సీట్లు కేటాయించాలని పేర్కొన్నారు. మెజారిటీ ఓటర్లు మాదిగలే ఉన్నారని, అంతే కాకుండా అన్ని పార్టీల నాయకులను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు కె పాపయ్య, విజయ్ ప్రభాకర్, పల్లె సదానందం, నాతారి పోషయ్య, ఎన్ బాపయ్య, లక్ష్మణ్, తిరుపతి, శంకర్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్‌పై విచారణ జరపాలి

కోటపల్లి, ఫిబ్రవరి 12: భారతీయ మెట్ట పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్ గ్రామాలకు సబ్సిడీపై ఇచ్చిన కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్ బదావత్ సంతోష్‌కు సోమవారం వినతిపత్రం అందించినట్లు ఎంపీపీ మంత్రి సురేఖరామయ్య తెలిపారు. నాలుగేళ్ళ నుంచి సబ్సిడీపై ఇచ్చిన వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, కోడిపిల్లలు, టార్పాలిన్ స్ప్రేయర్లు, ఎరువులు కేటాయింపులపై అనుమానం ఉందన్నారు. ఎస్సీ రైతుల ఎంపికలో గ్రామసభలు ఏర్పాటు చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఎంపిక చేశారన్నారు. ఏకపక్షంగా సాగిన దీనిపై సమగ్ర విచారణ జరిపి వివరాలు ఇప్పించాలని కోరినట్లు ఎంపీపీ పేర్కొన్నారు.

బహుజన సాహిత్య అవార్డు అందుకున్న రమేష్



అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 12 : మందమర్రి 1వ జోన్‌కు చెందిన సుంకరి రమేష్ బహుజన సాహిత్య అకాడమీ డా. బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డును అందుకున్నారు. తిరుపతిలో సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రమేష్ ఒక వైపు సింగరేణిలో ఎస్అండ్‌పీసీలో జూనియర్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తూ పేదలకు సహాయం చేయడం, సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల ఏరియాలోని కార్యాలయ ఉద్యోగులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ అవార్డుతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సన్నద్ధం

- ఫలితాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ
- 90శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- సజావుగా సాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు
- ఈ నెల 28 నుంచి పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలు

ఏసీసీ, ఫిబ్రవరి 12: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రైవేటు ఇంటర్ కళాశాలల్లో 9 పరీక్ష కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పది పరీక్ష కేంద్రాలు, కేజీబీవీ, టీఎస్ మోడల్ జూనియర్ కాలేజీలు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఆరు పరీక్ష కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా మొత్తం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తు న్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున చీఫ్ సూపరింటెండెంట్‌లు, 25 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, పోలీస్‌స్టేషన్‌ల నుంచి పరీక్ష కేంద్రాలకు పత్రాలను తరలించేందుకు కస్టోడియన్‌లు, పరీక్ష కేంద్రానికి ఒకరి వంతున సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, డీఐఈవో కన్వీనర్‌గా మరో ఇద్దరు సభ్యులు గల డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీ ఆధ్వర్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఈ నెల 28 నుంచి మార్చి 18వరకు ఇంటర్ ప్రథమ, ఈ నెల 29 నుంచి మార్చి 19 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. రోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు.



ఫలితాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ


జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యంలో గల 45 జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా కొన్ని కళాశాలల్లో అక్టోబర్, నవంబర్ నుంచి మిగిలిన అన్ని కళాశాలల్లో డిసెంబర్, జనవరి నుంచి ప్రత్యేక తరగతులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతుల్లో పాఠ్యాంశాల రివిజన్, అనుమానాల నివృత్తి చేస్తున్నారు. ఈ తరగతులు పరీక్షలు ప్రారంభమయ్యే వరకు కొన సాగించనున్నారు. జనవరి 22 నుంచి 29 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవత్సరంలో బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

సజావుగా సాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పది ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో, 16 సంక్షేమ జూనియర్ కళాశాలలు, మోడల్ కళాశాలలు, కేజీబీవీలు కలిపి మొత్తం 36 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 1 నుంచి జరుగుతున్నాయి. రోజు ఉదయం, మధ్యాహ్నం రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదటి సారిగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 19న ప్రాక్టికల్ పరీక్షలు ముగి యనున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 7106 మంది, ద్వితీయ సంవత్సరంలో 7031 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

- జిల్లాలో ప్రభుత్వ, వివిధ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, టీఎస్ మోడల్ జూనియర్ కళాశాలలు కలిసి 45, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 21 ఉన్నాయి. మొత్తం 66 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొదటి సంవత్సరం జన రల్ విభాగంలో పబ్లిక్ పరీక్షలకు 5455 మంది, ఒకేషనల్‌లో 1106 మంది, మొత్తం 6561 మంది పరీక్షలు రాయనున్నారు.

ఇంటర్ ద్వితీయలో జనరల్ విభాగంలో 5975, ఒకేషనల్ విభాగంలో 1160 మంది మొత్తం 7135 మంది పరీక్షలు రాయనున్నారు. 2023లో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో మొదటి సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో 86 శాతం ఉత్తీర్ణత, ప్రైవేటు కళాశాలల్లో 50 శాతం ఉత్తీర్ణత, ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో 75 శాతం, ప్రైవేటు కళాశాలల్లో 53శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ సంవత్సరం ప్రభుత్వ కళాశాలల్లో 88 నుంచి 90 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నారు.



హాల్‌టికెట్‌ల కోసం ఆందోళన చెందవద్దు

శైలజ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి



ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు హాల్ టికెట్‌ల కోసం ఆందోళన చెందవద్దు, ఫీజులు పూర్తిగా చెల్లించలేదని కళాశాలలు హాల్ టికెట్లు ఇచ్చేందుకు నిరాకరించే అవకాశమే లేదు. ఎందుకంటే ఆన్‌లైన్‌లో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చు. ఎలాంటి ఒత్తిడి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయాలి.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



గెలుపొందిన విద్యార్థులతో డీఈవో యాదయ్య

ఏసీసీ, ఫిబ్రవరి 12: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సోమవారం మంచిర్యాల పట్టణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలను డీఈవో యాదయ్య ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మెమోంటో, సర్టిఫికెట్లు అందించారు. సాధారణ వ్యర్థాలు తగ్గించడం, ఈ వ్యర్థాల నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవన విధానం, సుస్థిర ఆహారనియమాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టడం, నీరు, ఇంధన సంరక్షణ అంశాలపై పోటీలు నిర్వహించారు. పెయింటింగ్ విభాగంలో సానియా, ప్రథమ, సాయిదీప్తి ద్వితీయ, అక్షిత తృతీయ స్థాయిలో నిలిచారు. అలాగే పాటల పోటీల్లో అర్షిత ప్రథమ, స్నేహ ద్వితీయ, అలేఖ్య తృతీయ, కవిత్వం పోటీల్లో శ్రావ్య ప్రథమ, అఖిల ద్వితీయ, శ్రావణి తృతీయ, వ్యాసరచన పోటీల్లో పుష్పలత ప్రథమ, అంజి ద్వితీయ, హేస్మిత తృతీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, హెచ్‌ఎంలు రాజగోపాల్, శ్రీనివాస్, న్యాయనిర్ణేతలు నారాయణరావు, ప్రసాద్, శ్రీనివాస్, మూర్తి, జ్యోతి, మంజుల, పోచయ్య, సాయిసంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏసీసీ, ఫిబ్రవరి 12: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం సజావుగా జరిగాయి. ఉదయం జనరల్ విభాగంలో 531 మందికి 512 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 165 మందికి 155 మంది హాజరయ్యారు. మొత్తం 696 మందికి 667 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్ విభాగంలో 292 మందికి 276 మంది, ఒకేషనల్‌లో 145 మందికి 145 మంది మొత్తం 437 మందికి 421 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం వెంకటాపూర్, మామిడిగట్టు తదితర గ్రామాల్లో సోమవారం అధికారులు పారిశుధ్యపనులను సిబ్బంది చేత చేయించారు. మురికికాలవలు, రోడ్లను శుభ్రం చేయించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రశాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓరియంట్‌లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

కాసిపేట, ఫిబ్రవరి 12: దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఓరియంట్ సిమెంటు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్య పాల్‌రావు, ఆదివాసీ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఓరియంట్ సిమెంటు కంపెనీ నుంచి వచ్చే దుమ్ముధూళితో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, రైతులు పంటలు నష్టపోతున్నారన్నారు. ఓరియంట్ ప్రభావిత గ్రామాల్లోని యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిం చాలని కోరారు. మైన్స్ లీజును ఆదివాసీ సొసైటీ పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి పనులను కొనసాగించాలని, డీఎంఎఫ్‌టీ నిధులను ఓరియంట్ ప్రభావిత గ్రామాల్లోనే ఖర్చు చేసి అభివృద్ధికి కృషి చేయాలని, విద్య, వైద్యం, తాగు నీరు సదుపాయాలను కల్పించాలని విన్నవించారు. ఓరియంట్ యాజమాన్యం సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 15న దేవాపూర్‌లో జరిగే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని తెలిపారు. మడావి వెంకటేష్, కనకరాజు, రాజు, జైతు, అచ్యుత్‌రావు, బాపు, రాజం, జనార్దన్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జిల్లా పరిషత్ పాఠశాల తనిఖీ



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చైర్మన్ వేణు

నస్పూర్, ఫిబ్రవరి 12: నస్పూర్ మున్సిపాలిటీలోని సీతారాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను సోమవారం మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ళ వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజితమల్లేష్‌లు తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన వివరాలను ప్రధానోపాధ్యాయురాలు పద్మజాను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ దరణి మధుకర్, జిల్లా యూత్ అధ్యక్షుడు తాళ్ళ సంపత్ రెడ్డి, పట్టణ యువత అధ్యక్షుడు నరిగె నరేష్, నాయకులు కుమార్, స్వామి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్ రాజీనామా

ఏసీసీ, ఫిబ్రవరి 12 : మంచిర్యాల మున్సిపాలిటీలోని 16వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ పదవికి రాజీనామా చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మారుతి ప్రసాద్, చైర్మన్ రావుల ఉప్పలయ్యకు రాజీనామా పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య, వ్యాపార కారణాల రీత్యా కౌన్సిలర్ పదవికి, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

నెన్నెల, ఫిబ్రవరి 12: దేశవ్యాప్త కార్మికుల సమ్మె లో భాగంగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ పిలుపునిచ్చారు. గుండ్లసోమారంలో సోమవారం పోస్టర్లు విడుదల చేశారు. రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రత్నం తిరుపతి, పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

తేది: 13-02-2024
స్థలం: మంచిర్యాల
న్యాయవాదులు
నివాసం: ఎ-1 హోటల్, మంచిర్యాల, మొబైల్: 9182083515

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్


మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12: ప్రజావాణి సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. బెల్లం పల్లి, మందమర్రి, కన్నెపల్లి, మంచి ర్యాల, తాండూర్ తది తర ప్రాంతాల నుం చి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అంద జేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు సంబం ధించి అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం దిశగా ప్రథమ ప్రాధా న్యం ఇవ్వాలని ఆదేశించారు.

చెన్నూరు: చెన్నూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఏపీవో గంగాభవానీ, ఏపీఎం ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరు

జన్నారం: ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అధికారులు ఎవరూ రాకపోవడంతో ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. కేవలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఒక్కరే ఉండడంతో దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు వెనుదిరిగి వెళ్లిపోయారు. ప్రజావాణికి అధికారులే రాకపోతే సమస్యలను ఎవరు తీరుస్తారని ప్రజలు అంటున్నారు.









జడ్పీ సీఈవో, పలువురు ఎస్‌ఐల బదిలీ

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : జిల్లా పరిషత్ సీఈవో నరేందర్‌ను పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల జడ్పీ సీఈవోగా గణపతి రానున్నారు. అలాగే డిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. మంచిర్యాల డీఆర్‌డీవో శేషాద్రి సైతం బదిలీ కాగా ఆదిలాబాద్ డీఆర్‌డీవో కిషన్ మంచిర్యాల డీఆర్‌డీవోగా రానున్నారు.

ఎస్‌ఐల బదిలీలు

ఏసీసీ, ఫిబ్రవరి 12 : మంచిర్యాల జిల్లా పరిధిలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ రామగుండం ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీసీ నస్పూర్ ఎస్‌ఐ2గా పనిచేస్తున్న మేకల సంతోష్‌ను శ్రీరాంపూర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. శ్రీరాంపూర్ ఎస్‌హెచ్‌వో రాజేష్‌ను వీఆర్ రామగుండంకు బదిలీ చేశారు. మంచిర్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేయబడిన ఎస్‌ఐ మహేందర్‌ను మంచిర్యాల టౌన్ ఎస్‌ఐ2గా బదిలీ చేశారు. కన్నెపల్లి ఎస్‌హెచ్‌వో నరేష్‌ను దండేపల్లి ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. దండేపల్లి ఎస్‌హెచ్‌వో ప్రసాద్‌ను మంచిర్యాల టౌన్ ఎస్‌ఐ3 గా బదిలీ చేశారు. వీఆర్ రామగుండం ఎస్‌ఐగా పనిచేస్తున్న సురేష్‌ను హాజీపూర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. హాజీపూర్ ఎస్‌హెచ్‌వో నరేష్‌కుమార్‌ను వీఆర్ రామగుండంకుబదిలీ చేశారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్‌ల బదిలీ

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల ఎస్‌హెచ్‌వో నరేందర్‌ను కాటారం ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. మంథని ఎస్‌హెచ్‌వో గురువయ్యను మంచిర్యాల ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. మంచిర్యాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వసంతరావును నిర్మల్ స్టేషన్‌కు, పెద్దపల్లి ఎస్‌ఐ మనీషారాథోడ్‌ను మంచిర్యాల స్టేషన్‌కు బదిలీ చేశారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోలకు సన్మానం

జైపూర్, ఫిబ్రవరి 12: కుమరంభీంఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో సత్యనారాయణను సోమవారం ఎంపీవో అనిల్ ఆధ్వర్యంలో కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు. లక్ష్మణ్, తిరుపతి, పాల్గొన్నారు.

కోటపల్లి: కోటపల్లి నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో భాస్కర్‌ను ఎంపీపీమంత్రి సురేఖరామయ్య సన్మానించారు. బైస ప్రభాకర్, స్వామి, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఎంపీవో ఎంఏ అక్తర్, ఏపీవో వెంకటేశ్వర్లుతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి









మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 12: అచ్చంపేట మార్కెట్ చైర్‌పర్సన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్య వైశ్యులు మార్కెట్ చైర్మన్‌గా ఉండడం కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనన్నారు. తూకాల్లో మోసాలు జరిగితే, గిట్టుబాటు ధర లభించకపోతే చైర్మన్‌కు, సెక్రటరీకి ఫిర్యాదు చేయాలి కానీ ఇలాంటి దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్

జైపూర్, ఫిబ్రవరి 12: మండలంలోని ముదిగుంట గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉన్న ఇసుకను సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఏడు ట్రాక్టర్ల ఇసుక నిల్వగా గుర్తించామన్నారు. సీజ్ చేసిన ఇసుకను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసినా, నిల చేసినా కఠిన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

దుబ్బగూడెంలో వరుస దొంగతనాలు

కాసిపేట, ఫిబ్రవరి 12 : కాసిపేట పంచాయతీలోని దుబ్బగూడెంలో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయపడుతున్నారు. ఆదివారం రాత్రి దుబ్బగూడెంకు చెందిన గోనెల శ్రీనివాస్ ఇంటి తాళం పగులగొట్టి ఇత్తడి సామగ్రిని ఎత్తుకెళ్లారు. సోమవారం బాధితుడు కాసిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేకే ఓసీపీలో ముంపునకు గురవుతున్న దుబ్బగూడెంలో పలువురు ఇండ్లకు తాళాలు వేసి సమీప గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకుని విలువైన వస్తువులను దోచుకుంటున్నారని, పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

మహాసభల పోస్టర్ల విడుదల

భీమిని, ఫిబ్రవరి 12: ఖమ్మంలో మార్చి 3, 4, 5 తేదీల్లో జరిగే సీపీఐ ఎంఎల్ మాస్ లైన్, ఆలిండియా పార్టీ జాతీయ మహాసభల పోస్టర్లను సోమవారం ఖర్జీభీంపూర్ గ్రామంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని 14 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న విప్లవ కమ్యూనిస్టు పార్టీలు విలీనమై సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీగా ఏర్పడుతున్న సందర్భంగా ఖమ్మంలో ఐక్యతా మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సురేష్ , రమాదేవి, బాపురావు, లక్ష్మయ్య, లచ్చయ్యసన్నాసి పాల్గొన్నారు.

నేడు ఇంగ్లీష్ స్పెల్లింగ్ డ్రామా పోటీలు

ఏసీసీ, ఫిబ్రవరి 12: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో జిల్లాలోని అన్నిప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్ స్పెల్లింగ్, డ్రామా పోటీలను మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభకనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు సభ్యులు సత్తయ్య, విజయలక్ష్మీ, బాధ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

కోటపల్లి, ఫిబ్రవరి 12 : పారుపెల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో డాక్టర్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.హెచ్‌ఎం గుండేటి యోగేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఏసీసీ, ఫిబ్రవరి 12 : మంచిర్యాల ప్లంబర్ అసోసియేషన్ సభ్యుడు చిందం మధుకర్ వద్ద వర్కర్‌గా పనిచేస్తున్న శహరి శైలేష్ కూతురు భవనంపై నుంచి పడి గాయాలు పాలు కావడంతో సోమవారం అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా కేంద్రంలోని అసోసియేసన్ కార్యాలయంలో అధ్యక్షుడు పొట్టాల మల్లేష్, ఉపాధ్యక్షుడు సీహెచ్‌రాజ్‌కుమార్, కోశాధికారి తోకల అంజయ్యల ఆధ్వర్యంలో రూ. 10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చారి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



మంచిర్యాలలో భక్త మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు, దండేపల్లిలో జెండావిష్కరణ

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భక్త మార్కండేయ జయంతిని నిర్వహించారు. మార్కండేయ మహారుషి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు బోస్, దామోదర్, రాజేశం, జ్ఞాని, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: పద్మశాలీల ఆరాధ్య దైవమైన మార్కండేయస్వామి మహర్షి జయంతిని సంఘ భవనంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు బూర్ల వెంకటేశ్వర్లు స్వామికి మహారుద్రభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వోడ్నాల శంకర్ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు వడ్డెపల్లి దేవయ్య, ఆలిశెట్టి లక్ష్మణ్, ఎనగందుల దేవేందర్, రామస్వామి, సత్యం, తిరుపతి, బోల్లి శ్రీనివాస్, పద్మ, లత పాల్గొన్నారు.

వేమనపల్లి: కల్మలపేట, కేతనపల్లి గ్రామాల్లోని అభయాంజనేయస్వామి దేవాలయాల్లో మార్కండేయ జయంతిని నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంఘం ప్రెసిడెంట్ కోడూరి దుర్గయ్య, గ్రామ పెద్దలు దూలం బాపు, రామచంద్రం, పోశన్న, భీమయ్య, వెంకటేశం, సమ్మయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: మార్కండేయ జయంతి పురస్కరించుకుని లక్ష్మీగణపతి మార్కండేయస్వామి ఆలయంలో పూజలు జరిగాయి. శరత్ మాక్స్ సూపర్‌విజన్ కంటి ఆసుపత్రి వారు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు వంద మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆలయ అవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామన్న, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలగాని బొడ్డయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు బండి పద్మ, కోశాధికారి రాజబాబు, నాయకులు శరవందం, సదానందం పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గల సరస్వతి మాతా ఆలయంలో మార్కండేయ మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆడెపు లక్ష్మణ్, తిరుపతి, వేముల వెంకటేషం, అశోక్, సాంబారు వెంకటస్వామి, శివప్రసాద్, సంతోష్, రాజేష్, రాజు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో భక్త మార్కండేయ జయంతిని పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేశారు. భూమన్న, భాస్కర్, శంకర్, వెంకటేష్, రాజు, పద్మశాలీలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12: మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యను, వైస్‌చైర్మన్ మహేష్‌ను సోమవారం జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి లయన్ వి.మధుసూధన్‌రెడ్డి సన్మానించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కౌన్సిలర్లు నల్ల శంకర్, పోడేటి రాజు, సత్యపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కొండల్‌రావు, రవీంద్రరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక పుస్తకాలు పంపిణీ

కోటపల్లి, ఫిబ్రవరి 12: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వివేకానంద స్ఫూర్తిదాయక పుస్తకాలను సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థి కపిల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు బానాల లక్ష్మీనారాయణ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో బంగారు పతకం

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12: యోగా అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో బాలికల జూనియర్ కాలేజీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీ ల్లో మంచిర్యాలకు చెందిన రాహుల్ బంగారు పత కం సాధించాడు. తిరుపతి వర్మ, శ్రీనివాస్‌లు అభినందించారు.

విద్యుత్ తీగలు అమర్చితే జైలు శిక్ష

కాసిపేట, ఫిబ్రవరి 12: వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చితే 7 ఏండ్ల జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తామని ఫారెస్టు డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఆదివారం రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అడవిలో విద్యుత్ తీగలు అమర్చడంతో వాటికి తగిలి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గం



ఎన్నికైన టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గసభ్యులు

ఏసీసీ, ఫిబ్రవరి 12 : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా గడియారం శ్రీహరి రెండోసారి ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీహరి, కార్యదర్శిగా రామ్మోహన్, కోశాధికారిగా సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, రాంకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బాపురావు, జాయింట్ సెక్రెటరీగా రవికిరణ్, ఏసయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రావణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా యూసుఫ్, తిరుమలేశ్వర్ తదితరులను ఎన్నుకున్నారు. నూతన సభ్యులను పలువురు అభినందించారు.

అయోధ్యకు బయలుదేరిన రామభక్తులు



అయోధ్యకు వెళ్తున్న వారితో బీజేపీ నాయకులు

చెన్నూరు, ఫిబ్రవరి 12: మండలంలోని వివిధ గ్రామాల నుంచి అయోధ్యకు బయలుదేరిన రామ భక్తులను సోమవారం సుద్దాల సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద బీజేపీ నాయకులు ఆహ్వానించి కాషాయ కండువాలను కప్పారు. అనంతరం భక్తులు అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. నాయకులు దుర్గం అశోక్, అక్కల రమేష్, శంకర్, బుర్ర శేఖర్, ఆలం బాపు, కౌటారి బాపు పాల్గొన్నారు.

నెన్నెల: అయోధ్యకు మండల భక్తులు బయలుదేరి వెళ్లారు. జిల్లా కేంద్రం నుంచి అయోధ్యకు బయలుదేరే ప్రత్యేక రైలులో 27 మంది మండల వాసులు వెళ్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు శైలెందర్‌సింగ్ తెలిపారు. కోట వంశీ, డాక్టర్ కృష్ణ, అంగలి సతీష్, కొమ్ము కిష్టయ్య, నల్ల రాజేందర్, మిట్ట సత్యనారాయణ సతీష్ అయోధ్యకు వెల్లిన వారిలో ఉన్నారు.

కలుషిత నీరు తాగి
15 మేకలు మృతి

జైపూర్, ఫిబ్రవరి 12 : మండలంలోని ఇందారం సమీపంలో గల యూసుఫ్ అనే సింగరేణి కాంట్రాక్టర్ ఇటుకల బట్టీ వద్ద కలుషిత నీరు తాగి సోమవారం సాయంత్రం సుమారు 15 మేకలు మృతిచెందాయి. మరో 20 మేకల పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పూజరి సుధాకర్, పూజరి పోసక్క, చెలుకాని సాయిలు, కొరివి రమేష్‌లకు చెందిన మేకలు ఉదయం అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఇటుకల బట్టీ వద్ద నిల్వ ఉన్న నీటిని మేకలు తాగాయి. వెంటనే 15 మేకలు మృతి చెందగా మరో 20 మేకల పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై బాధితులు, స్థానిక యువకులు ఇటుకల బట్టీ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టర్ ఇటుకల బట్టీ వద్ద కొంత కాలంగా పది వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకుల్లో నీటిని నిల్వ చేసి రసాయనాలు కలిపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. వీటిని దేనికి ఉపయోగిస్తారనే విషయం ఎవరికి తెలియడం లేదని వారు తెలిపారు. ట్యాంకుల నుంచి వచ్చిన రసాయన నీటిని తాగి మేకలు మృతి చెందాయని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉపేందర్ సంఘటన స్థలానికి చేరుకుని గొడవను సద్దుమణిగేలా చేశారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఇటుకల బట్టీ నిర్వహకున్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. జిల్లా అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ జరిపి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన మేకలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాము కాటుకు గురైన యువకుడు

కాసిపేట, ఫిబ్రవరి 12: కాసిపేటకు చెందిన గుల్బం కోటమ్మ ఆదివారం మృతి చెందగా సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వస్తుండగా కొల్లూరి సతీష్‌ను పాము కాటు వేసింది. దీంతో సతీష్ కేకలు వేయడంతో అంత్యక్రియలకు హాజరైన వారు వెంటనే కాసిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. కాసిపేట వాగు సమీపంలో విద్యుత్ లైట్లు లేకపోవడం వల్ల తరుచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వాగు సమీపంలో కరెంటు వెలుగులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న
కళాశాలల గుర్తింపును రద్దుచేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 : జిల్లాలో యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ స్టేట్ కార్యనిర్వ హక సభ్యుడు దీపక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌ను నియమిం చాలని, పీహెచ్‌డీ పట్టా కలిగి ఉండాలన్నారు. కళాశా లల్లో పీహెచ్‌డీ పట్టా లేని వారితో కళాశాలలు నడుస్తున్నాయని తెలిపారు. కనీస వసతులు లేకుండా రేకుల షెడ్డులో కళాశాలలు నడిపిస్తున్నారన్నారు. నిబం ధనలు పాటించని కళాశాలలపై చర్య తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోక పోతే ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

వైద్య శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: కాగజ్‌నగర్ మున్సిపాల్టీ ఆవరణలో సోమవారం న్యూట్రిషియన్ ప్లస్ వెల్‌నెస్ సెంటర్, ప్రజాబంధు ఫౌండేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కీర్తి, నవ్యశ్రీ, సుమిత్ గుప్తా, షర్మిల, హీనా టాంగ్, ట్రైనర్లు తానియా గాబా, పూజా తలాని, కమిషనర్ అంజయ్య, ఫారూక్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

రెబ్బెన, ఫిబ్రవరి 12: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఎస్సై చంద్రశేఖర్ న్నారు. సోమవారం గోలేటి యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిశీలించిన డీఎల్‌పీవో



దరఖాస్తులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేష్‌బాబు

కౌటాల, ఫిబ్రవరి 12: కౌటాల మండల కేంద్రంలో సోమవారం డీఎల్‌పీవో సురేష్‌బాబు, ఏపీవో మౌనికలు గృహ జ్యోతి, గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లకు వచ్చే అధికారులకు సహకరించాలని వారు అడిగే పత్రాలను చూపించాలని చెప్పారు. అనంతరం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై కార్యదర్శులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నెలాఖరు లోగా వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఆయన వెంట విద్యుత్ శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

- ప్రధాన వీధుల్లో భక్తుల శోభాయాత్ర



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగు సమీపంలో గల మార్కండేయ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి చిత్రపటంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు ఏకరూప దుస్తులతో భక్తి పాటలతో కోలాటాలు ఆడడం ఆకట్టుకుంది. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉదయం ఆలయం వద్ద గణపతి పూజ, మార్కండేయ స్వామిప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు ఆంజనేయులు, లింగయ్య, ధర్మయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, సంజీవ్, మోహన్, మధుకర్, విజయ, సునీత, పుష్ప పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మార్కండే మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పద్మశాలి అధ్యక్షులు వెంకటేశ్వర్లు, గోలేటి పద్మశాలి సంఘం నాయకులు వీరస్వామి, సమ్మయ్య, సత్యనారాయణ, స్వరూపరాణి, మంగ బోగ, శ్రీదేవి, జయశ్రీ, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. సోమవారం మండలంలోని రౌటసంకెపల్లి గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కందులను దళారులకు అమ్ముకొని మోసపో వద్దని ప్రభుత్వం కొనుగోలు చేసిన కేంద్రాలలో కందులు అమ్ముకోవాలని సూచించారు. దీంతో రైతులకు నేరుగా వారం రోజుల లోపు వారి డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీసర్పంచ్ విమల, ఐకేపీ అధికారులు శ్రీనివాస్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు భూమి పూజ

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని కొటగూడ గ్రామంలో సోమవారం జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కల్వర్టు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గ్రామంలోని కల్వర్టు నిర్మాణానికి రూ.6 లక్షల నిధులతో, డ్రైనేజీ నిర్మాణానికి రెండు లక్షలతో పనులు ప్రారంభిం చామని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, నాయ కులు భీమన్న, లక్ష్మణ్, అంబరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జైనూర్, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలో ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని చెప్పారు. వాహనాలకు సంబంధించిన కాగితాలు, అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనాలను జాగ్రత్తగా నడుపుకోవాలని, అజాగ్రత్తగా నడిపి ప్రయాణి కులను ఇబ్బందులు పెట్టకూడదని సూచించారు.

రెండు కుటుంబాల్లో విషాదం

- అనుమానాస్పద స్థితిలో ఇద్దరు యువకుల మృతి



తుమ్మిడే హరీష్ మహేష్(ఫైల్)

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 12: మండలంలో ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి అనుమానా స్పదస్థితిలో మృతి చెందడంతో చింతలమానేపల్లి మండల కేంద్రంతో పాటు కర్జవెల్లి గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్జవెల్లి గ్రామానికి చెందిన తుమ్మిడే హరీష్(22), చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన కంబాల మహేష్(22) అనే యువకులు ఇద్దరు స్నేహితులు. మహేష్ అన్న కంబాల శ్రీను పెళ్లి ఆదివారం జరిగింది. వివాహ వేడుకల్లో పాల్గొన్న మహేష్, హరీష్ సాయంత్రం బైక్‌పై ఊరి బయటకు వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మహేశ్ కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. కొందరు హరీష్ ఇంటికి వెళ్లి ఆరా తీయగా ఇద్దరు తమకు కనబడ లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం ఆచూకీ కోసం గాలిస్తుండగా ఊరి బయట ఓ చోట వారు వెళ్లిన బైక్ ఓ పాడు బడిన బావి సమీపంలో కనిపించింది. గ్రామస్థులు బావిలో చూడగా నీటిపై చెప్పులు తేలి కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బావిలో నుంచి మృతదేహాలను వెలికి తీశారు. బావి సమీపంలో బైక్ పెట్టిన చోట మద్యం బాటిల్ ఉండడంతో వారితో మరొకరు వచ్చారా, మహేష్, హరీష్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహేష్ సోదరుడు కంబాల శ్రీను, హరీష్ కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ ఇద్దరిని ఎవరో చంపి మృతదేహాలను బావిలోకి తోసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంధువులు ఫిర్యాదు మేరకు సీఐ సాదిక్ పాషా ఆధ్వర్యంలో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని ఎస్సై సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమాన్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12: జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం గార్డెన్‌లో టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలిచాలని వేతనాలతో జర్నలిస్టులు సామాజిక సేవ దృక్పథంతో పని చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండి పోరాడితేనే హక్కులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు ఎస్ వేణుగోపాల్, ప్రకాష్‌గౌడ్, సతీష్, కృష్ణంరాజు, సురేష్, నవీన్‌గౌడ్, చంద్రకాంత్, బిక్కాజీ, రమేశ్, హన్నన్, రమేశ్, రాధేశ్యాం, శ్రీనివాస్, రాంచందర్, తారు, నితేష్, మిలిన్‌కమార్, నౌషాద్, రఫిక్, శివ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

బెజ్జూరు, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను సోమవారం కాగజ్‌నగర్ ఏడీఏ మనోహర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎరువుల విక్రయాలు ఆన్‌లైన్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్ స్టాక్ తేడాలు ఉన్నట్లయితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరిం చారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువులకు సంబంధించిన స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట కార్యదర్శి సంజీవ్ ఉన్నారు.

నవోదయలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- కాగజ్‌నగర్‌లో పేరేంట్స్ గది నిర్మాణం
- రూ.18.44లక్షలు నిధుల విడుదల
- రూ.13లక్షలతో షెడ్ల పనులు



కాగజ్‌నగర్ నవోదయా విద్యాలయం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: నవోదయ విద్యాలయంలో అభివృద్ధి పనులకు అడుగులు పడుతున్నాయి. దేశంలోనే తొలిసారిగా కాగజ్‌నగర్ విద్యాలయంలో పేరేంట్స్ గది నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యాలయంలో కేవలం రెండో శనివారం మాత్రమే తల్లిదండ్రులను తమ పిల్లలను చూసేందుకు అనుమతిస్తారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారంతా ఉదయం 7.30 నుంచి సాయంత్రం వరకు ఉంటారు. అయితే కేవలం నవోదయ విద్యాలయంలోని ప్రాంగణంలోనే అనుమతిస్తారు. పిల్లల గదులకు వెళ్లేందుకు అనుమతించరు. పిల్లలతో ఉండేందుకు ఆరుబయటనే ఉండాల్సి వస్తుండటంతో తరుచూ తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని నవోదయ విద్యాలయ సమితి అధికారులు దేశంలో ఉన్న నవోదయ విద్యాలయాలకు రూ.1కోటి నిధులు విడుదల చేసింది. ఈ నిధుల ద్వారా పేరేంట్స్ కోసం గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించింది. ఈ మేరకు కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రపాణి ఆధ్వర్యంలో సిబ్బంది అవసరమైన నివేదికను పంపగా రూ.18.44లక్షల నిధులను నవోదయ విద్యాలయ సమితి విడుదల చేసింది. నిధులు విడుదల కావటంతో పనులు చేపట్టేందుకు సెంట్రల్ పబ్లిక్ వర్క్‌శాఖకు పనులు అప్పజెప్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే టెండరు పిలిచి మరో మూడునెలల్లో ఈ గదుల నిర్మించనున్నారు. అలాగే ఈ విద్యాలయంలో చదువుతున్న అమ్మాయిల కోసం బట్టలను ఆరబెట్టుకునేందుకు రూ.13లక్షలతో షెడ్లను నిర్మించేందుకు కూడా ప్రతిపాదనలను పంపించారు. నిధులు కూడా విడుదల అయ్యాయి. అదేవిధంగా రూ.10లక్షలతో బాత్‌రూంలు కూడా నిర్మించనున్నారు. దీంతో విద్యాలయ సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదలయ్యాయి..



నవోదయ విద్యాలయాల్లో మొదటగా కాగజ్‌నగర్‌లోని విద్యాలయానికే సమితి రూ.18.44లక్షలు నిధులను విడుదల చేసింది. ఈ నిధులతో తల్లిదండ్రుల కోసం ప్రత్యేక గదిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిని మూడు నెలల్లో పూర్తి చేస్తాం. అదేవిధంగా బాత్ రూంలు, బట్టలు ఆరేసుకునేందుకు షెడ్లు కోసం కూడా నిధులు విడుదలయ్యాయి. వాటి నిర్మాణాలను త్వరలోనే ప్రారంభిస్తాం.

- చక్రపాణి, నవోదయ ప్రిన్సిపాల్, కాగజ్‌నగర్



పెండింగ్ బిల్లుల 'పంచాయతీ'



గ్రామ పంచాయతీల ద్వారా చేపట్టిన వివిధ రకాల పనుల బిల్లులు రాక సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. పదవీ కాలం ముగిసినా ఇప్ప టికీ లక్షల్లో బిల్లులు రావల్సి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.

- పదవీకాలం ముగిసినా అందని బకాయిలు
- ఎస్ఎఫ్‌సీ నిధులకు మోక్షం కరువు
- ఇబ్బందులు పడుతున్న తాజా మాజీ సర్పంచులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12: గ్రామ పంచాయతీల ద్వారా చేపట్టిన వివిధ రకాల పనుల బిల్లులు పదవీ కాలం ముగిసినా అందక పోవడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. పదవీలో ఉన్నప్పుడే బిల్లుల కోసం ట్రెజరీల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. దేశానికి పట్టు కొమ్మలైన గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని ప్రభుత్వాలు పదే పదే హామీలు గుప్పిస్తుంటాయి. కానీ సకాలంలో గ్రామ పంచాయతీలకు నిధులు అందించడంలేదు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు రాక ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణకు ఎస్ఎఫ్‌సీ(స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్)నిధులు, కేంద్ర 14వ ఆర్థిక సంవత్సర నిధులు ఇంకా విడుదల చేయలేదు.

11 నెలలుగా..

ఎస్ఎఫ్‌సీ నిధులు 11 నెలలుగా నుంచి రావడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం అందించే 14వ ఆర్థిక సంవత్సర నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు ఎప్పటికప్పుడు నిధులు అందించి గ్రామాల అభివృద్ధికి దోహదపడాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిధులు నిలిపివేయడంతో అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదవీ కాలం ముగిసిన గ్రామ పంచాయతీలకు సంబందించిన పెండింగ్ బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మాజీ సర్పంచులు వాపోతున్నారు.

జిల్లాలో 335 పంచాయతీలు..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయి. గ్రామాల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతారు. గతేడాది నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో గ్రామాల్లో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ఈఎంఐ, ట్రాక్టర్‌లో డీజిల్, కరెంట్ బిల్లులు, మురికి కాలువల శుభ్రత, వీధిలైట్లు, వాటర్‌పైప లైన్‌ల లీకేజీలు, రోడ్ల శుభ్రత తప్పక చేయాల్సినవి కావడంతో సర్పంచులు కొందరు సొంత డబ్బులతో చేపట్టారు. మరికొందరు అప్పు చేసి ఖర్చు చేశారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా సర్పంచులకు కోట్లలో బకాయిలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో సర్పంచులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరు చేయాలి..: జాబోరే అరుణ, మాజీ సర్పంచ్



గుండి గ్రామ పంచాయతీలో చేసిన పనులకు సంబందించిన బిల్లులు రూ. 12 లక్షలకు పైగా రావాలి. పనులు చేసిన వెంటనే నిదులి వ్వాలి. పదవీ కాలం ముగిసినా బకాయిల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

బిల్లులు అందక అప్పుల్లో కూరుకుపోయాం..: శ్రీనివాస్, మాజీ సర్పంచ్



రహపల్లి గ్రామపంచాయతీలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయాం. గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, మురికి కాలువల శుభ్రం తదితర పనులకు సంబందించిన రూ. 18 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.

సోయం బాపూరావ్‌కే ఎంపీ టికెట్ ఇవ్వాలి

- బీజేపీ జిల్లా నాయకుడు ఆత్రం భీంరావ్

జైనూర్, ఫిబ్రవరి 12: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తిరిగి ఎంపీ టికెట్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావ్‌కే ఇవ్వాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆత్రం భీంరావ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఎంపీ సోయం బాపూరావ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని చెప్పారు. ముఖ్యంగా ఆదివాసీల ఉన్నతి కోసం ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తింపజేశారని అన్నారు. అధిష్ఠనం ఆలోచించాలని కోరారు. సమావేశంలో రాథోడ్ సందీప్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోగా అనిల్

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: ఆసిఫాబాద్ జడ్పీ సీఈఓగా అనీల్‌కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్ టీఎస్ఐఆర్డీలో జేడీగా పని చేస్తున్న ఆయనను కుమరం భీం జిల్లా జడ్పీ సీఈవోగా నియమించారు. గతంలో ఇక్కడ పన చేసిన రత్నమాలను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

కెరమెరి, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని రామగౌడ్ తోటలో మంగళవారం విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకులు ప్రవీణ్‌గౌడ్ తెలిపారు. దుర్గామాత, కొదండ రామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాలు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో మండల వాసులందరు విధిగా హాజరు కావాలని కోరారు. కలశ, గణపతి, పుణ్యాహవచనం, రుతిగ్వర్ణానము, నంది ముఖం, అకుంరారోషణ నవగ్రహ, యోగిని తదితర పూజ కార్యక్రమాన్ని వేదపండితులు నారాయణమూర్తి, గౌతమ్ శర్మ, సీతారామశర్మ చేపట్టనున్నట్లు తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12: జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ జాఫర్, భీమేష్, ఎల్లయ్య, సుభాష్, రాజేందర్, కార్తీక్, సాయికుమార్, సతీష్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామానికి చెందిన విజయలక్ష్మి, తిరుపతి, బానక్క నిరుపేద కుటుంబానికి చెందిన తాము కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నామని, తమకు ఉపాధి కల్పించాలని వేర్వేరుగా దరఖాస్తులు అందజేశారు. ఆసిఫాబా ద్ పట్టణానికి చెందిన బాబురావు తాను కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నానని తనకు ఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజేశాడు. ఆసిఫాబాద్ మండల కేంద్రానికి చెందిన పార్వ తి తాను డిగ్రీ పూర్తి చేశానని, నిరుపేద అయిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ అందజేసింది. రెబ్బెన మంలం నారాయణపూర్ గ్రామానికి చెందిన మాదాసు కిష్టయ్య తన తండ్రి నుంచి తమకు వారసత్వంగా రావాల్సిన భూమిని తమపెద్ద అన్న పేరిట నమోదు చేశారని, దీనిని సవరించి ముగ్గురు అన్నదమ్ములకు సమాన వాటాగా ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖాధికారుల సమన్వయంతో పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

● దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేవ మందిరంలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ఆర్జీదారులు చేసుకున్న దరఖాస్తుల పరిష్కారం, తిరస్కరణ వివరాలను సంబంధిత అర్జీదారుడికి లిఖిత పూర్వకంగా తెలియపర్చాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను ప్రతి రోజు నివేదిక అందించాలని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరు అయిన అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారి , కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌తోతో కలిసి జిఇల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్‌లతో ప్రజావాణి దరఖాస్తుల నిర్వహణపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వినతి

పెంచికలపేట, ఫిబ్రవరి 12: మండలంలోని ఎల్కపల్లి శివారులో గల సర్వే నంబరు 61, ఎల్లూరు శివారులోని సర్వే నంబరు 342 రెవెన్యూ స్థలం కబ్జాకు గురవుతుందని, కాపాడాలని సోమవారం బీఎస్పీ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేవారు. పెంచికలపేట మండలంగా ఏర్పడడంతో కాలి ప్రదేశాల్లో భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని అధికారులు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శ్రీనివాస్, శంకర్‌గౌడ్, చం దు, మొండి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్పూర్(టి), ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని డౌనల్ మసీదులో ఇమామ్ విధులు నిర్వహించిన ఇనాయత్ అలీ సోమవారం గుండె పోటుతో మృతిచెందగా పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆసుపత్రిలో వైద్యుడి నియామకం

లింగాపూర్, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని ఆసుపత్రికి వైద్యుడిని నియమించడంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. లింగాపూర్ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత పేరుతో 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో ఆదివారం కథనం ప్రచురితమవడంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు డాక్టర్ ఆజీమ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలు నియోగించుకోవాలని కోరారు. కథనం ప్రచురించి సమస్యను పరిష్కరించిన 'ఆంధ్రజ్యోతి'కి పలువురు అభినందనలు తెలిపారు.

బీజేపీ విధానాలు సరికాదు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



బంద్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యులకు ఇబ్బందులు కలిగేలా తీసుకునే విధానాలు సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఈ నెల 16న చేపట్టనున్న భారత్ బంద్ పోస్టర్లను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక రంగానికి విస్మరించిందన్నారు. కార్మికుల శ్రమదోపిడీ చేసి కార్పొరేటర్లకు మద్దత పలుకుతోందన్నారు. నూతనంగా తీసుకొచ్చిన చట్టాలు కార్పొరేటర్లకు అనుకూలంగా ఉన్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ బంద్ చేపడుతున్నట్టు తెలిపారు. అన్ని సంఘాల మద్దతు ప్రకటించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి కుమార్, నాయకులు నారాయణ, సురేష్, అంజి, కిషన్, ధర్మయ్య, జయకర్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: కాగజ్‌నగర్ ఫాతిమా కాన్వెంటుకు చెందిన విద్యార్థులు వరంగల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే టోర్నమెంటులో బ్రౌన్‌బెల్టులో బిందుష, కె.అశ్విత్ యాదవ్, శ్రీనాథ్, వివేక్ తేజ, అబ్దుల్ అయాన్ స్పారింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్టు మాస్టర్ దేవయ్య తోలినాకె, విజేతలకు సినీనటుడు సుమన్ చేతుల మీదుగా మెడల్స్ ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ పార్టీలో పట్టణానికి చెందిన పలువురు నాయకులు సోమవారం పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రావి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్నీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కౌటాల, ఫిబ్రవరి 12: రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధ నలు పాటించాలని ఎస్సై మధుకర్ అన్నారు. కౌటాల- బెజ్జూరు మెయిన్ రోడ్డులోని గురుడు పేట గ్రామంలో ప్రమాదాలు జరగకుండా వేగనియంత్రణ సూచికలు(డ్రమ్ములను)లను ఏర్పాటు చేశారు. వాహనదారులు అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ మాసంలో భాగంగా ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా మని తెలిపారు. ప్రతి ఒక్కరూ వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: కాగజ్‌నగర్ వినయ్ గార్డెన్ సమీపంలోని గోడౌన్‌లో స్టాక్ ఏర్పాటు చేసుకున్న రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. రేషన్ బియ్యం నిల్వ చేసి మహారాష్ట్రకు అక్రమంగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. స్టాక్ చేసిన రేషన్ చేసిన బియ్యాన్ని స్వాధీనం పర్చుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన సీఐ

పెంచికలపేట, ఫిబ్రవరి 12: పెంచికలపేట మండలం ఎల్కపల్లి గ్రామంలో మండల అటవీ కార్యాలయ భవన నిర్మాణ విషయంలో అటవీ అధికారులు, గ్రామస్థుల మధ్య కొనసాగుతున్న వివాదాస్పద స్థలాన్ని సోమవారం సీఐ నాగరాజు పరిశీలించారు. ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సోమవారం సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ సీఐ నాగరాజు, తహసీల్దార్ వెంకటేశ్వర రావు, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్‌లు పరిశీలించారు.

స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ ప్రారంభం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: కాగజ్‌నగర్ ఎస్పీఎం ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్ మెంటు సెంటర్‌ను సోమవారం మిల్లు యూనిట్ హెడ్ ఏకే మిశ్రాజి ప్రారంభించారు. నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీఎం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో

ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం

- సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 12: కేంద్రంలో మోదీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థల ను నిర్వీర్యం చేశారని సీఐటీయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ అన్నారు. ఏరియాలోని కేకే 5 గనిపై సోమవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం అయ్యాయని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు జాతీయ సంపద అంతా కట్టబెడుతు న్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే ఆదానీ, అంబానీ ఆస్తుల పెంపకానికి కేంద్రం దోహదపడుతుందన్నారు. కార్మికులు ఉద్యోగ విరమణ తర్వాత వారికి ఉపయోగపడే నికర నిధి సీఎంపీఎఫ్ 12 శాతం నుంచి 10 శాతంకు తగ్గించే అవకాశాలున్నాయని చెప్పారు. పని గంటలు పెంచే చట్టాలు కూడా మారుస్తున్నారని, చివరికి సమ్మె చేసుకునే హక్కును సైతం కాలరాసే విధంగా కోడ్‌లను రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ సమ్మెకు బీఎంఎస్ మినహా ప్రాంతీయ సంఘమైన టీబీజీకేఎస్ సైతం గనుల పై ప్రచా రం చేయాలన్నారు. ఈ సమ్మె ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పిలుపుని చ్చారు. ఈ సమ్మెకు సంఘటిత, అసంఘటిత కార్మిక సంఘాలు సహకరిస్తా మని తెలిపారు. ఎస్ వెంటకస్వామి, అల్లి రాజేందర్, మహ్మ ద్ ఆరిఫ్, బేతి భరత్ పాల్గొన్నారు.

'సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ జరిపించాలి'

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 : సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని సీఎంపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్‌లో రూ.900 కోట్ల కుంభకోణం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించి, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బొగ్గు గని కార్మికుల భవిష్యనిధి భద్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎస్ఆర్‌పీ 1 గనిపై యూనియన్ల వాగ్వాదం



ఏజెంట్, మేనేజర్లను ప్రశ్నిస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12: శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పీ 1 గనికి చెందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు కొట్టె వెంకటేష్ ఆదివారం ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయంలో సోమవారం ఎస్ఆర్‌పీ 1 గనిపై యూనియన్ నాయకులు వాగ్వాదానికి దిగారు. తమ తప్పు లేదంటే తమ తప్పులేదని సమర్ధించుకున్నారు. యాజమాన్యానిదే తప్పంటూ నెపం నెట్టివేశారు. కొట్టె వెంకటేష్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తుండగా, ఇటీవల అతనితో పాటు పది మంది షిఫ్టుల్లోకి మార్చారు. దీంతో అతను ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయంలో సోమవారం గనిపై గొడవ జరిగింది. ఇరుపక్షాలకు చెందిన యూనియన్ల నాయకులు హాజరయ్యారు.

● కార్మికుడి ఆత్మహత్యాయత్నంపై ఆగ్రహం

ముందుగా ఏజెంట్, మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అసమర్థత వల్లే ఇలా జరిగిందని ఆరోపించారు. అయితే ఏఐటీయూసీ చెప్పడం వల్లే మార్పులు, చేర్పులు జరిగాయని వారు చెప్పారు. వారి పెత్తనం ఎక్కువైందని ఐఎన్‌టీయూసీ నాయకులు ఆరోపించారు. ఉద్యోగుల మార్పు విషయంలో తమకు ఏ సంబంధం లేదని ఏఐటీయూసీ నాయకులు బదులిచ్చారు. ఒకరితో ఒకరు వాగ్వాదానికి దిగారు. చివరకు యాజమాన్యం తప్పిదం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని తేల్చేశారు. విధులకు సమ యం కావడంతో ఎక్కడివారక్కడ వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న శ్రీరాంపూర్ పోలీసులు బందోబస్తు చేపట్టారు. జీఎం బి సంజీవరెడ్డి గనిపైకి వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. జీఎం కార్యాల యానికి వస్తే చర్చిం చుకుందామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కె. వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, పాల్గొన్నారు.

● జీఎంతో చర్చించిన జనక్ ప్రసాద్

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ జీఎం కార్యాలయానికి చేరుకొని ఎస్ఆర్‌పి 1 మేనేజర్ విజయ్ కుమార్, ఏజెంట్ గోపాల్‌సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు అన్యాయం చేయవద్దని సూచించారు. అనంతరం జీఎం సంజీవరెడ్డితో మాట్లాడారు. దీంతో జీఎం వెంటనే స్పందించి షిఫ్టులకు మార్చిన వారికి తిరిగి యథాస్థానాల్లోకి పంపించారు. జనక్ ప్రసాద్ ముందుగా బాధితుడు కొట్టె వెంకటేష్‌ను ఆస్పత్రిలో పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె శంకర్‌రావు, నాయకులు గరిగె స్వామి, కలవేన శ్యాం, తిరుపతి రెడ్డి, అంజి రెడ్డి, సమ్మయ్య, రావుల అనిల్, భీం రవి, చందు, మోహన్, తదితరులున్నారు.

అధికారుల సంఘం ఖండన

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్‌పీ 1 గనిలో జరిగిన ఘటనకు మేనేజర్ విజయ్‌కుమార్‌ను బాధ్యుడిని చేయడాన్ని ఖండిస్తున్నట్లు సింగరేణి అధికారుల సంఘం(సీఎంఓఏఐ) అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర బాధ్యులు తెలిపారు. జీఎం కార్యాలయంలో సోమవారం వారు సమావేశమయ్యారు. ఎస్ఆర్‌పీ 1 గనిలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మి కుడు కొట్టె వెంకటేష్ తనను షిఫ్ట్ మార్చడంతో ఆగ్రహంతో గని మేనేజర్ విజయ్ కుమార్ ఫొటో వాట్సప్ గ్రూపులో పెట్టి ఆయన చనిపో యారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పోస్ట్ పెట్టారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఈ చర్య వలన మేనేజర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఎంతో బాధకు గురయ్యారన్నారు. కార్మికులకు సమస్యలుంటే యాజమాన్యం తోగాని, యూనియన్ ద్వారాగాని మాట్లాడి పరిష్కరించుకోవాల న్నారు. అలాగే కొట్టె వెంకటేష్ ఆత్మహత్యాయత్నం చేయడం వల్ల తన సమస్యకు పరిష్కారం లభించదన్నారు. తాము యాజమాన్యం నిబంధనలకు లోబడి పనిచేస్తామని వివరించారు. విధుల్లో భాగంగా తీసుకునే నిర్ణయాలను కార్మికులు, యూ నియన్ నాయకులు వ్యక్తిగతంగా తీసుకొని అధికారులను లక్ష్యంగా చేసుకోవ డం సరికాదన్నారు. రెండు యూనియన్ల మధ్య ఉన్న శతృత్వానికి అధికారిని బాధ్యుడిని చేసి నిందించడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.



సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 12: సింగరేణి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంవీటీసీ కార్యాలయంలో మల్టి డిపార్టుమెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమం లో జాయింట్ సెక్రెటరీ రవి, అధికారులు పి రాజన్న, ఉజ్వల్ బందోపాధ్యాయ, శంకర్, రమణారెడ్డి, మైత్రేయిబంధు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ, ఆర్కే 1, సీహెచ్‌పీలో, ఏరియా ఆసుపత్రి, సివిల్, హెల్త్ డిపార్టుమెంట్, ల్యాబ్ అండ్ రీజనల్ డిపార్టుమెంట్ ఉద్యోగులకు మందమర్రి ఏరియా ఎస్ఓటూ జీఎం ఎ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్టీ డిపార్టు మెంటల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఆంజనేయులు, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయబంధు, డీవైజీఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

